# "పాపం! పట్నాయక్!"

## బెహరా వెంకట సుబ్బారావు

రైల్వే గేటు దాటి పట్నంలో ప్రవేశించబోతోంది ఆర్టీసీ బస్. జేబులో పదిలంగా దాచి వుంచిన బస్ టికెట్‌ని బయటకు తీసాడు పట్నాయిక్. వెనక్కి తిప్పి చూసాడు. అర్ధ రూపాయి బాకీ వున్నట్టు కండక్టరు దానిపై పెన్సిల్‌తో రాసాడు. రైల్వే గేటు దాటిన వెంటనే గాంధీనగరం జంక్షన్ వస్తుంది. అక్కడ అతను దిగాలి, దిగేటప్పుడు మర్చిపోకుండా ఆ 'బాకీ'ని వసూలు చేసుకోవాలి. ఇది వరలో రెండు మూడు సార్లు మర్చి పోవడం జరిగింది. మరలా మర్చిపోయి దిగి పోతానేమోనని జ్ఞాపకంగా టికెట్టుని తీసి చేత్తో పట్టుకొన్నాడు.

గాంధీనగర్ జంక్షన్‌లో ఆగింది బస్. చివాల్న లేచి స్టాండింగ్ పాసింజర్లను తప్పించుకొంటూ గేటు ధగ్గరకి నడిచాడు పట్నాయిక్. అప్పటికే డోరు తెరచి వుంచాడు కండక్టరు. ముగ్గురు పాసింజర్లు దిగారు. పట్నాయిక్ బస్ దిగలేదు. గేటులో పై మెట్టు మీద కండక్టరు కెదురుగా నిలబడ్డాడు. చేతిలో వున్న టికెట్ చూపిస్తూ.

"అర్ధ రూపాయి యివ్వాలి!" అన్నాడు. అతని మాటలు వినిపించుకోలేదు కండక్టరు. వెనక్కి తిరిగి చూస్తున్నాడు. ఇంకా దిగే పాసింజర్లు వున్నారేమోనని. చిల్లర డబ్బులు ఎగవేయడానికే అతనలా ప్రవర్తిస్తున్నాడనుకొన్నాడు పట్నాయిక్. అతని మీద కోపం వచ్చింది.

"త్వరగా దిగండి మాష్టారూ!" తొందర చేస్తూ విసుక్కొన్నాడు కండక్టర్, పట్నాయిక్ ఒక్క మెట్టు కూడా దిగలేదు.

"ఏభై పైసలు వాపసు యివ్వాలి!" అన్నాడు మరోసారి టికెట్ చూపిస్తూ.

"నాక్కూడా అర్ధ్రూపా యివ్వాలి కండక్టరు బాబూ!" వెనుక నుండి మరో పాసింజరు అర్థించడంతో వెనక్కి తిరిగి చూసాడు పట్నాయిక్. ఆ పాసింజరు పల్లెటూరి వాడు. మాసిన పంచని మోకాళ్ల వరకూ ఎగకట్టాడు. అంత కన్నా మాసిన బనీను ధరించాడు. వీపు మీద చిన్న గోనె మూట! అతను కూడా అక్కడే దిగబోతున్నాడు. తనకు మరొకడు తోడు దొరకడంతో ధైర్యం వచ్చింది పట్నాయిక్కి.

వాళ్ల అభ్యర్ధనలని ఏవీ పట్టించుకోకుండా గద్దించాడు కండక్టరు.

"దిగండి మాష్టారూ! టైమయిపోయింది!"

"అర్ధ రూపాయి బేలన్సు వస్తుంది!" పట్నాయిక్.

"నాక్కూడా అర్ధ్రూపాయివ్వాలి బాబూ!"

"చిల్లర లేదు! స్టాండుకి రండి!" అన్నాడు కండక్టరు నిర్లక్ష్యంగా విసుగ్గా. పట్నాయిక్కి అతని మీద అమితమైన ఆగ్రహం వచ్చింది. అర్ధ రూపాయి కోసం రెండు మైళ్ళ దూరంలో వున్న బస్ స్టాండుకి వెళ్తే అట్నుంచి రిక్షా వానికి మూడు రూపాయలు యిచ్చుకోవాలి! లేదా ఎండలో నడచి రావాలి. చిల్లర డబ్బుల మీద ఆశ వదలుకొన్నాడా పల్లెవాడు.

"దిగండి బాబూ!" పట్నాయిక్‌ని తొందర చేసాడు. అతను అడుగు కదపలేదు. ద్వారానికి అడ్డంగా నిలబడ్డాడు.

పట్నాయిక్ వైఖరి డ్రైవర్‌కీ కోపం తెప్పించింది. బస్ ఓ కుదుపుతో బాటు వార్నింగ్ కూడా యిచ్చింది.

"త్వరగా దిగుతావా? స్టాండుకి తీసుకు పోనా?" అని అడిగింది.

"తప్పుకోండి బాబూ! నే దిగిపోతా!" తొందరపడ్డాడు వెనుకనున్న పాసింజరు.. పట్నాయిక్కి బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది.

"మా యిద్దరికీ కలిపి రూపాయి నోటు యివ్వండి! మార్చుకొని పంచుకొంటాం!" సులువు చెప్పాడు.

కండక్టరు తన బేగ్‌లో వున్న నోట్లని బయటికి తీసి చూసాడు. వాటిలోంచి అయిదు రూపాయల కాగితం చేత్తో పట్టుకొన్నాడు. "నాలుగివ్వండి! అయిదిస్తా!" అన్నాడు. తన దగ్గరున్నవీ ఐదు రూపాయల నోట్లే! నిస్సహాయ స్థితిలో పడ్డాడు పట్నాయిక్. బేలన్సు వదలుకోక తప్పదనుకొన్నాడు. అయితే అతని అదృష్టం కొద్దీ వెనుకనున్న ఆ పాసింజరు ముందు కొచ్చాడు "నా దగ్గరున్నాయి బాబూ!" అంటూ.

బనీను లోపల జేబులోంచి నోట్లని బయటకి తీసాడు. రెంర్డూపాయిల నోట్లు చాలా వున్నాయ్. రెండు నోట్లు అందించి అయిదు రూపాయిల నోటుని కండక్టరు దగ్గర తీసుకొన్నాడు. విజయగర్వంతో బస్ దిగాడు పట్నాయిక్, వెనుకనే వీపు మీద మూటతో ఆ పల్లె వాడూ దిగాడు. దబాల్న డోరు వేసుకొన్నాడు కండక్టర్. బస్ కదిలింది. ఆ జంక్షన్‌లో మూడు టీ కొట్లూ రెండు కిళ్ళీ బడ్డీలు వున్నాయ్. చిల్లర మార్చుకో వచ్చుననుకొన్నాడు పట్నాయిక్.

"నీ పేరేవిఁటోయ్? కాస్త ఆగు! ఇక్కడ చిల్లర దొరుకుతుందేమో ప్రయత్నిస్తా!" కదలబోతూన్న ఆ ఆసామీతో అన్నాడు.

"నా పేరు రావుఁలండి! ఈ బడ్డీవోళ్ళు సిల్లరివ్వరండి! పోనీ అడిగి సూడండి!" అన్నాడు రావులు బుజం మీది గోనె మూటని సర్దుకొంటూ.

తన దగ్గరున్న అయిదు రూపాయిల కాగితాన్ని బయటకి తీసి రెండు బడ్డీల దగ్గర ప్రయత్నించాడు. చిల్లర దొరకలేదు.

"నాతో రండి బాబూ! తవఁ రర్ధ్రూపాయి ఒక్క చ్ఛణంలో యిచ్చేత్తా!" అంటూ ముందుకు కదిలాడు రావుఁలు. చేసేది లేక అతణ్ణి అనుసరించాడు. రావుఁలు ఎక్కడ ఎలా చిల్లర సంపాదిస్తాడో అర్థంకాలేదతనికి. వెనుకనే నడుస్తూన్న పట్నాయిక్ దృష్టి రావులు గోనె మూట మీద పడింది."

"ఆ మూటలో ఏమున్నాయ్?" అడిగాడు.

"అటు కులండి! రోజూ పట్నం వచ్చి అమ్ముకుంటానండి!" చెప్పాడు రావులు గబగబా అడుగులు వేస్తూ, మొదటి వీధిలో పడ్డాడు.

పట్నాయిక్ పూర్తి పేరు కంచుర్తి పరమేశ్వర పట్నాయిక్! కానీ ఆఫీసులో అంతా కక్కుర్తి పట్నాయిక్ అంటారు. అందు క్కారణం లేకపోలేదు. ఆఫీసు లంచవరులోనైనా కనీసం టీ కూడా తాగడు. అతనికి కాఫీ టీలు పడవనీ అలవాటు లేదనీ కాదు! డబ్బులిచ్చి తాగడు. ఎవరైనా ఆఫర్ చేస్తే ఆనందంగా సేవిస్తాడు. లంచ్ బ్రేక్‌లో అంతా కాఫీ టీలు తాగుతూంటే ఓ గ్లాసుడు నీళ్ళు మాత్రం తీసుకొంటాడు.

కూరల బజారులో అందరిలా మేలి రకం కూరలుండే దుఖాణాల జోలికి పోడు. బజారు పక్క సందులో వుండే దుకాణాల దగ్గరకి వెళ్తాడు. ఆ సందులో కొంచెం వాడినవీ, మాగినవీ తక్కువ ధరకి అమ్ముతారు. వాటిలో మంచివి ఎంచి మరి కాస్త బేరం చేసి అతి తక్కువ ధరకి కొంటాడు.

పట్నాయిక్ కక్కుర్తి తనానికి అతని ధర్మపత్ని కూడా అప్పుడప్పుడు అతని మొహం మీదనే విసుక్కొంటుంది. మల్లెపూలు మాంచి చౌకగా అంటే పావు సేరు పావులాకి అమ్మిన రోజుల్లో కూడా ఓ పావు సేరు కొనడు. "ఆ పావలాకి పాతిక దొండకాయలు వస్తాయ్! ఒకరోజు కూర' అంటాడు. భార్య పోరు పడలేక ఏ రెండు నెలలకో ఒకసారి సినీమాకి బయలుదేరుతాడు. అదయినా రానూ పోనూ నడిచి వెళ్లే షరతు మీద.

ఆ యిద్దరూ మొదటి వీధి తిరగడం అయింది. రావుఁలుకి బేరం తగల్లేదు. తిరిగి వెనక్కి వచ్చి రెండో వీధిలో చొరబడ్డాడు రావుఁలు. అతనితో నడవలేక ఆ వీధి మొదట్లోనే ఆగిపోయాడు పట్నాయిక్. వేసవి కాలం కావడం వల్ల ఉదయం పది గంటలకే ఎండ భరింప రానిదిగా వుంది. వడగాల్పులు వీస్తున్నాయ్. వాడె లాగూ తిరిగి వస్తాడన్న ధీమాతో ఆ వీధి మొదటనే ఆగాడు.

"ఈ వీధిలో కూడా రావులికి బేరం తగలక పోతే? తన అర్ధ రూపాయి ఎలా వస్తుంది?" ఆలోచనలో పడ్డాడు. దాహం ఎక్కువైంది. అటూ యిటూ చూసాడు. ఎక్కడా వీధి కొళాయి కనబడలేదు.

ఎదురుగా కిళ్ళీ కొట్లో సోడా కొట్టిన చప్పుడు వినపడింది. సోడా తాగడానికి చిల్లర లేదు. సోడా యిరవై పైసలు! ఇరవై పైసలకి అయిదు రూపాయల కాయితం యిస్తే తిడతాడు. ఆ కిళ్ళీ షాపు దగ్గరకి నడిచాడు.

"అయిదు రూపాయల నోటుంది! సోడా కావాలి!" అన్నాడు.

పట్నాయిక్ దీన వదనం చూసి జాలి పడ్డాడా కిళ్ళీ బడ్డీ వాడు. కొంత మంది సోడా తాగాక నోటుని అందిస్తారు స్టయిల్‌గా. చిల్లర లేదని ముందుగానే చెప్పిన పట్నాయిక్‌పెద్ద మనిషిగా తోచాడతనికి.

అయిస్ బాక్సులోంచి సోడా తీసి 'కంయ్'మనిపించి అందించాడు. అయిస్ సోడా అవడం వల్ల మరో పది పైసలు ఎక్కువ తీసుకొంటాడు. మామూలు సోడా యిస్తాడనుకొన్నాడు పట్నాయిక్. పది పైసలెక్కువయినా ఎండలో చల్లగా వుంటుందనుకొన్నాడు. రావులు వైపు చూస్తూ సోడా బుడ్డి ఖాళీ చేసాడు. పళ్ళు జివ్వుమంటున్నాయ్. రావులు వైపే చూస్తూ చేతిని వెనక్కి జాపి ఖాళీ సోడాని బడ్డీవానికి అందివ్వబోయాడు. ముందు బల్ల మీద పేర్చిన బ్రెడ్ పేకట్నికి సోడా బుడ్డి తగలడంతో రెండు పేకట్లు కింద బడ్డాయి. ఠకీమని వెనక్కి తిరిగి చూసాడు. అక్కడే కాచుకుని కూర్చున్న కుక్క ఓ బ్రెడ్ పేకట్టుని నోట కరచుకొని పారిపోయింది. అది చూసి బావురుమన్నాడు పట్నాయిక్. జేబులోంచి అయిదు రూపాయల నోటు తీసి అందించాడు.

'బ్రెడ్ ఖరీదు రూపాయి పావలా సోడా ముప్పై పైసలు" అంటూ మిగతా డబ్బు అందించాడు కిళ్ళీ బడ్డీవాడు. ఏడుపు మొహంతో అందుకొని వీధిలోకి చూసాడు పట్నాయిక్. రావులు ఒక యింటి ముందు గుమ్మంలో కూర్చొని అటుకులు కొలుస్తున్నాడు. తన దగ్గరున్న రూపాయిన్నర యిచ్చి వాడి నుంచి రెండ్రూపాయల కాగితాన్ని తీసుకోవాలనుకొన్నాడు. గబగబా రావులున్న యింటి దగ్గర కెళ్ళాడు. ఆ యిల్లు ఎత్తుగా వుంది. ఏడెనిమిది మెట్లున్నాయ్.

"రండి బాబూ! తవఁరి డబ్బులు తీసుకోండి!" అరుగు మీద నుంచి ఆహ్వానించాడు రావుఁలు. చరచరా ఆ యింటి మెట్లెక్కి రావులు దగ్గర అర్ధ రూపాయి బిళ్ళ తీసుకొని విస విసలాడూ మెట్లు దిగాడు. చీకాగ్గా వున్న పట్నాయిక్ అడుగులు సరిగా పడలేదు. ఆ యింటి ఆఖరి మెట్టు దిగుతూంటే కాలి జోడు పట్టీ ఠపీమని తెగింది. మంత్రం వేసినట్టు అడుగు వేయలేక అలాగే ఆగిపోయాడు. మూడు వారాల క్రితం అతి తక్కువ ధరలో కొన్న ఆ కొత్త హవాయి చెప్పుని విసిరి పారేయలేడు. ఆ క్షణంలో అతని అవస్థ ఆ పరమాత్మునికే తెలియాలి!

ఆ జోళ్ళ జతని తీసి చేతిలో వున్న సంచీలో వేసుకొన్నాడు. కాళ్ళు కాలుతూంటే మైలున్నర దూరంలో వున్న బజారులోకి నడిచాడు. రెండు రూపాయిలు పెట్టి కొత్త పట్టీలు కొనడానికి పాపం పట్నాయిక్. □

